
వివరాలు మెయిన్‌లో

**సిపిఐ శతజయంతోత్సవాలు జయప్రదం చేయండి**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
### నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 05 నవంబరు , 2025 | పేజీలు : 06


# నాణ్యత లోపిస్తే ఉపేక్షించం

**నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో రాజీపడేది లేదు**

**మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలలో ఎత్తిపోతల పథకాలపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం**



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎత్తిపోతల నిర్మాణాలలో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలపై డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లోపించిందని తెలిస్తే ఉపేక్షించేది లేదని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతాంగం కళ్ళలో వెలుగులు నింపడంతో పాటు హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలను సస్యశ్యామలం చేయడానికే ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మొదలు పెట్టామన్నారు. అటువంటి నిర్మాణంలో నాణ్యత లోపించిందని తెలితే సహించేది లేదని అధికారులకు, ఏజెన్సీలకు అల్టిమేటం జారీ చేశారు. హుజూర్‌నగర్ నియోజక వర్గ పరిధిలోని మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకంతో పాటు జవహర్ జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్, బెట్టే తండ, నక్కగూడెం, రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకాల పురోగతితోపాటు హుజూర్‌నగర్‌లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయ భవన పురోగతిపై సమీక్షించారు. కోదాడ నియోజక వర్గ పరిధిలోని రెడ్లకుంట, రాజీవ్ శాంతినగర్, ఆర్9, మోతె ఎత్తిపోతల పథకాలతో పాటు కోదాడలో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయ భవన నిర్మాణం పురోగతిని తెలుసుకున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల ద్వారా నిర్దేశిత ఆయకట్టుకు అనుకొని ఉన్న భూములు సేద్యంలోకి వస్తాయని భావిస్తే ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అధికారులకు సూచించారు. మైనర్ మార్పులతో అదనపు ఆయకట్టు సేద్యంలోకి వచ్చేందుకు అయ్యే అదనపు నిధులను సమకూరుస్తానని వెల్లడించారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాల నిమిత్తం ప్రభుత్వం భూసేకరణ నిర్వహించి రైతులకు నగదు చెల్లింపులు జరిపిన భూములను సత్వరమే అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. పంటకు పంటకు మధ్యలో ఉండే సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాలపై ఆయకట్టు రైతాంగం పెంచుకున్న ఆశలు అమలులోకి రావాలంటే నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, ఇఎన్‌సిలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు, హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.

# అకడమిక్ విద్యతో పాటు సృజనాత్మకత

**నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**ప్రజాపక్షం/నల్లగొండ:** విద్యార్థులు జీవితంలో మంచి స్థానాన్ని పొందేందుకు పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు, ఒకేషనల్ కోర్సులు, సృజనాత్మకత అవసరమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలు ,9 ,10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా ముందు గా వాటిపై అవగాహన కల్పించి అనంతరం సెట్విన్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక వృత్తులపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం ఆమె జిల్లా కేం ద్రం సమీపంలోని రాంనగర్‌లో ఉన్న అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఒకేషనల్ ట్రైనింగ్ పై విద్యార్థినిలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇన్చార్జి డిఆర్‌ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, డీఈఓ బిక్షపతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రునాయక్ ఉన్నారు.

**పునరావాస కాలనీల పనులను వేగవంతం**

వివిధ ప్రాజెక్టుల కింద మిగిలిపోయిన భూసేకరణ పనులు, పునరావాస కాలనీల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజనీరింగ్ ,రెవిన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆమె తన చాంబర్లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, ఎత్తిపోత పథకాల కింద భూసేకరణ, పునరావస పనులపై సమీక్ష నిర్వహించారు.

## నేడు సిపిఐ నకిరేకల్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్(నకిరేకల్) :** సిపిఐ నకిరేకల్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం బుధవారం 11.00 గంటలకు నకిరేకల్‌లోని గుడిపాటి ఫంక్షన్‌హాల్లో జరుగుతుందని జిల్లా సహాయ కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జి లోడంగి శ్రవణ్ కుమార్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం పాల్గొంటున్నారని తెలియజేశారు.

# మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

**ఎకరాకు ఏడు క్వింటాల పత్తి పరిమితిని ఎత్తివేయాలి**

**17 నుంచి జిల్లాలో సాగే బహిరంగ సభ ప్రచార జాతను జయప్రదం చేయాలి**

**బిసి బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చే వరకూ పోరాటం :ఎంఎల్‌సి సత్యం**




**ప్రజాపక్షం/నల్లగొండ :** మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి,వరి పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వలను కోరారు.సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్ లో మంగళవారం జరిగిన నల్లగొండ నియోజకవర్గ మండల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తడిసినటువంటి వరిధాన్యం,పత్తిని ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. రైతన్నలు వ్యవసాయ సాగు కోసం వడ్డీలకు అప్పులు తెచ్చి ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్‌తో పూర్తిగా నీటిలో మునిగిపోయి తీవ్ర నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి ఎకరాకు రూ.40వేలు పత్తికి ఎకరాకు రూ. 60చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాల పరిమితిని ఎత్తివేసి యధావిధిగా12 క్వింటాలు పత్తిని దిగుమతి చేసుకునేలా సడలింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన సిసిఐ నిబంధనలు సడలించి8 నుంచి12 శాతం ఉన్న నిబంధనను ఎత్తివేసి 20 శాతం వరకు పెంచాలన్నారు.అలాగే డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభకు వేలాదిగా తరలిరవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బహిరంగ సభ ప్రచారజాత ఈనెల 17న నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో చేరుకొని జిల్లాలో దేవరకొండ,మునుగోడు,నకిరేకల్,నల్లగొండ,మిర్యాలగూడ,నియోజకవర్గాల మీదుగా సాగుతుందని ఈ జాతాను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రక్రియను ముందుకు తీసుకుపోయే క్రమంలో బిజెపి గవర్నర్ కనుసన్నాల్లో బిల్లును అడ్డుకుంటుందని విమర్శించారు.కేంద్రంలో బీసీ బిల్లును 9వ షెడ్యూల్ లో చేర్చే వరకు సిపిఐ పోరాడుతుందని అన్నారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గూరి నరసింహ అధ్యక్షత వహించగా జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,నల్లగొండ పట్టణ కార్యదర్శి కెవిస్ రెడ్డి,సహాయ కార్యదర్శి వి.లెనిన్,కనగల్ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,సహాయ కార్యదర్శి దొటి పందరి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.రామ్ కోటి,నాయకులు జిల్లా యాదగిరి,జోగు సురేందర్,కట్ట వెంకన్న,కట్ట యాదయ్య, ముండ్ల ముత్యాలు,యూసుఫ్, మదర్,కౌసల్య,విజయ, నాగమ్మ ,లక్ష్మి,నందన్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యానికి సరైన మద్ధతు ధర

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రైతులు పండించిన ధాన్యానికి మద్ధతు ధర కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని మండల వ్యవసాయ అధికారి గణేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అర్వపల్లి, బొల్లంపల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కనీస మద్ధతు ధర పొందాలంటే రైతులు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం 5శాతం మించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శోభారాణి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

## పోలీసు ప్రతిష్ఠను కించపరిచేలా ప్రసారం చేయొద్దు

**ప్రజాపక్షం/అర్వపల్లి (నాగారం) :** పోలీసు ప్రతిష్టను కించపరిచేలా ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నాగారం సర్కిల్ పరిధిలో గల అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి స్టేషన్ల పరిధిలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నాగారం సర్కిల్ పోలీస్ సిబ్బంది అనుక్షణం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. నిత్యం తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రత రక్షణలో రాత్రి పగలు, ఎండ వాన అని చూడకుండా క్లిష్ట సమయాల్లో పనిచేస్తున్నామని తెలిపారు. అలాగే ఏదైనా సమాచారాన్ని ప్రచారం చేయదలచిన, వార్తను ప్రచురితం, ప్రసారం చేయదలచిన అలాంటి దానిపై ముందస్తుగా పై అధికారులకు తెలియజేయాలని, నిజానిజాలు వివరణ తీసుకోవచ్చని సూచించారు.

## దాతల సహకార అభినందనీయం

**ప్రజాపక్షం/ కోదాడ:** మాలధారుల నిత్య అన్నదానానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కోదాడ పట్టణ హుజూర్‌నగర్ రోడ్డు బైపాస్ సమీపంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ కమీటి ప్రదాన కార్యదర్శి చల్లా రామూర్తి అన్నారు. బుధవారం మండలపరిధి చిమిర్యాల గ్రామానికి రావూరి రంగయ్య జ్ఞాపకార్థం ధర్మపత్ని రావూరి లక్ష్మి మాలధారుల అన్నదానానికి రూ॥18,116లు అందించారు. నిత్యం మాలధారులకు పెరుగును అందిస్తున్న వి.ఎన్.ఆర్ డైరీ నకిరేకల్ డైరెక్టర్ మారెళ్ల పుల్లారెడ్డి, ధర్మపత్ని నాగమణిలు అందించారు. ఈ సందర్బంగా దాతలను ఆలయ కమీటి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రావూరి రవీంద్ర ధర్మపత్ని విజయలక్ష్మి, రాజేంద్రర్,శ్రవణి దంపతులు, వారిజ, తిరుపతి రావు, శ్రీరంజని, వెంకట్రావ్, గురుస్వామలు, డైరెక్టర్లు, మాలధారులు పాల్గొన్నారు.



# ‘బేటీ బచావో బేటీ పడావో’ కార్యక్రమం



**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో మండలం లోని ఆగామోద్ పూర్ జెడ్పి పాఠశాల నందు మంగళవారం భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా దామరచర్ల ప్రాజెక్టు సిడిపిఒ యన్ చంద్ర కళ మేడమ్ మాట్లాడుతూ కిశోర బాల బాలికలకు పోషకాహారం,వ్యక్తి గత పరిశుభ్రత,గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్యవివాహాల గురించి,చైల్డ్ హెల్ప్ లైన్,అక్రమ దత్తత గురించి వివరించడం జరిగింది.అనంతరం పాఠశాల యందు బాలికలను వ్యక్తిగతంగా కలిసి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.కార్యక్రమంలోఐసిడియస్ సూపర్వైజర్ జె.నాగమణి, హెడ్మాస్టర్ వినోద్ కుమార్, హైస్కూల్ టీచర్స్ నగేష్,జనార్ధన్ నాగేందర్, రెడ్డి,అనంతరెడ్డి,బ్లాండిన,గురువయ్య,ఆనంద్ కుమార్,అంగన్వాడి టీచర్స్ హేమలత, షాకిరా బాను,కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

## మాలధారులు ఆర్‌టిసి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కోదాడ:** పరమ పవిత్ర కార్తీకమాసంలో కోదాడ పట్టణ పరిసర ప్రాంత మాలధారులు, భక్తులు, ప్రజలు కోదాడ ఆర్టీసీ వారు పవిత్ర పంచ రామా దర్శనాలకు ఈనెల ప్రతి ఆదివారం అందిస్తున్న బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపోమేనేజర్ బి.శ్రీనివారావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణ హుజూర్‌నగర్ రోడ్డులో పట్టణ ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం నాయకులు గాలి శ్రీనివాసనాయుడు, తన అన్న గాలి రమేష్‌నాయుడు జ్ఞాపకార్థం మాలధారులకు నిర్వహిస్తున్న నిత్యన్నాదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లగ్జరీ బస్సుకు పెద్దలకు రూ॥ 1,800లు, చిన్నారులకు రూ॥ 1,000లు చార్జి చేస్తున్నాట్లు తెలిపారు. ఆదివారం రాత్రి 9గంటలకు బయలుదేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట దర్శనాల అనంతరం మంగళవారం ఉదయం కోదాడకు చేరుకుంటున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహాకులు గాలి శ్రీనివాసనాయుడు, సీతారాంసింగ్ రంగారావు, తమ్మిశెట్టి మణి, పూజారి పవన్‌కమార్‌ఆచార్యులు, డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, మాలధారులు పాల్గొన్నారు.

## రజకుల కోసం రక్షణ చట్టం తేవాలి




**ప్రజాపక్షం/చిట్యాల:** సమాజంలో దళితుల తర్వాత రజకులు, నాయి బ్రాహ్మణుల వంటి వృత్తి దారులు ఉన్నారని, వారిపై పెరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టడానికి రక్షణ చట్టం తీసుకురావాలని రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం మండల మహాసభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. గ్రామాలలో ఇనాం, లావణ్య పట్టా, అసైన్డ్ భూముల అన్యాక్రాంతం కాకుండా భూమి మీద ఉన్న వారికి హక్కు పత్రాలు అందజేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్ష మంది రజక వృత్తిదారులున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, వారి సంక్షేమం కోసం రూ. 150 కోట్లు కేటాయించినా తగిన బడ్జెట్ కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని, పెండింగ్‌లో ఉన్న మోడ్రన్ దోబీ ఘాట్‌లకు తగిన నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆశయ్య అన్నారు. ఈ సమావేశానికి ఐతరాజు యాదయ్య అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షులు చెరుకు పెద్దులు, ఆమనగంటి స్వామి, రుద్రారపు పెద్దులు, ఆమనగంటి నరేష్, అక్కెనపల్లి నాగయ్య, ఐతరాజు నర్సింహ్మా, పాలమాకుల అర్జున్, మహేష్ పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో పర్యావరణహిత ఎకో బజార్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్థానిక రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణహిత ఎకో బజార్‌ను మంగళవారం నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్‌ఖానం అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం, పర్యావరణ పరిరక్షణ కలిగించాలనే సంకల్పంతో ఈ ఎకో బజార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులచేత వివిధ వస్తువులు, తినుబండారాలు, ప్లాస్టిక్ రహిత పదార్ధాలతో కూడిన 16స్టాళ్లను ఏర్పాటు చేసిన నిర్వహించడం జిరగిందని, తెలంగాణ పిండి వంటలను విద్యార్థులే స్వయంగా తయారు చేసి ఈ స్టాళ్లలో అమ్మడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రజలు సందర్శించారు. జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు సి.జగదీష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు చదువుతోపాటు మంచి నైపుణ్యాన్ని పెందుతారని అన్నారు. ఉపాదిని పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఐక్య ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నీలిమా, అకడమికల్ కోఆర్డినేటర్ జె.చిన్నబాబు, పాలనాధికారి కరుణాకర్, అధ్యాపకులు రత్నమంజుల, సునీత, తండు కృష్ణకౌండిన్య, వెంకట్‌గౌడ్ కిషన్, బ్రహ్మం, రవీందర్‌రావు, శ్రీను, శ్రీనివాస్, బాలరాజు, అమర్, నరేష్, ఆంజనేయులు, రవి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



## 15న ప్రత్యేక లోక్ అదాలత్


**ప్రజాపక్షం/ రామన్నపేట/వలిగొండ:** ఈనెల 15న ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నందున సద్వినియోగం చేసుకునేలా పరిష్కారం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమక్షంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జడ్జి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షి దారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ ఎస్ఐలు డి.నాగరాజు,యుగేందర్‌గౌడ్, నాగరాజు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర రెడ్ల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలనీ ఈడబ్ల్యూఎస్ వర్గాలకు అన్ని పోటీ పరీక్షలలో వయోపరిమితిని సడలించాలని రాష్ట్ర రెడ్డి జేఏసీ సభ్యులు గంగిడి సుదర్శన్ రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా పార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్త రెడ్డి సంఘాల ముఖ్య నాయకులతో పాటు పోచంపల్లి మండలంలోని వివిధ గ్రామాల రెడ్డి సంఘం నాయకులూ ధర్నాలో పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలను చెల్లించి ఆదుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేసి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాన్ని, అధ్యాపకులను, విద్యార్థులను ఆదుకోవాలని విజేత కళాశాల అధ్యాపకులు కోరారు. మంగళవారం పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన యాజమాన్యం, అధ్యాపకులు సాగర్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందచేసి మాట్లాడారు. గత నాలుగేళ్లుగా ఆయా ప్రభుత్వాలు ప్రైవేట్ కళాశాల యాజమాన్యానికి ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించకపోవడంతో యాజమాన్యాలు,అధ్యాపకులు, విద్యార్థుల జీవితాలు సంక్షోభంలో పడ్డాయని, అనేకమంది పేద విద్యార్థులు విద్యకు దూరం కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అనేక కళాశాలలు మూతపడే పరిస్థితులు దాపురించాయని అన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు సైదమ్మ, జ్యోతి, సతీష్,మధు, రమేష్ పాల్గొన్నారు.

## అమరవీరుల వారోత్సవాలు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ లాల్‌బంగ్లాలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ అధ్వర్యంలో అమరవీరుల వారోత్సవాలను ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్బంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కుల, మత, అసమానతలు లేని సమసమాజ స్థాపనకు అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను సమాజం మార్చిపోదాని, వారి చూపిన బాటలో ప్రయనించి ఆశయసాధనకు పాటుపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, పివైఎల్ జిల్లా ప్రదాన కార్యదర్శి డి.రవి పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.హేమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో గల జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాలొని మాట్లాడుతూ పోక్సో చట్టం, చిన్నారుల చట్టబద్ధమైన దత్తత, బేటీ బచావో బటావో అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఇటీవల జరుగుతున్న సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆడపిల్ల ప్రతిక్షణం తనను నాను రక్షించేకునేలా బీటీ బచావో బేటీ పడావో అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు భాగ్యలక్ష్మి, లక్ష్మి, సత్యలక్ష్మి, కిశోర బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాహనాలను జాగ్రత్తగా నడపాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు చాలా జాగ్రత్తగా నడపాలని హుజూర్‌నగర్ సిఐ జి చరమందరాజు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకై వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులకు, ఆటో డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు తమ వాహనాలను నడుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బండి మోహన్‌బాబు, ఎంపిడిఓ పి లావణ్య, ఆర్‌అండ్‌బి అధికారులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** హైదరాబాద్‌లో ఈ నెల 11న జరుగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు పోచంపల్లి మండల పట్టణ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మంగళవారం బోరబండ పోలింగ్ బూత్ 330లో ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కెసిఆర్ పాలనలో అన్ని రంగాలలో చేసిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, పిఎసిఎస్ కందాడి భూపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బాత్క లింగస్వామి, పగిళ్ల రామ్ రెడ్డి, తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.



## యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు



**ప్రజాపక్షం/హాలియా:** పేరూరు వద్ద గల లోలెవెల్ కల్వర్టుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వరద నీటికి దెబ్బతిన్నలో లెవెల్ కల్వర్టుకు మరమ్మతులు గత రెండు రోజులుగా చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు హాలియాకు వచ్చేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన తక్షణం దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక నాయకులను ఆదేశించారు. కార్తీక మాసం కావడంతో పేరూరు గ్రామంలో గల శివుని దర్శించుకునేందుకు అయ్యప్ప భక్తులు, కార్తీకమాసంలో శివ భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున వస్తుంటారు. దారి సరిగ్గా లేకపోవడంతో ఇక్కడికి వచ్చే భక్తులకు చుట్టూ తిరిగి రావాల్సి ఉండడం ఇబ్బందిగా మారింది. ఈ సమస్యలను ఆలకించిన ఎమ్మెల్యే తక్షణమే కొట్టుకుపోయిన కల్వర్టుకు మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించడంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

## శేషయ్య ఆశయ సాధనకు కృషి చేద్దాం



**ప్రజాపక్షం/మోటకొండూరు :** అమరజీవి, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటయోదుడు రెడ్డిగట్టు శేషయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూరు మండల కేంద్రంలో రెడ్డిగట్టి శేషయ్య 18వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటకొండూరు ప్రాంతంలో మాలుగడ్డ 950 సర్వే నెంబర్‌లో ఇల్లు లేని పేద వర్గాలకు ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను కబ్జాలు పెట్టి ఇంటి నిర్మాణాలను, 549 సర్వే నెంబర్లలో పేద కూలి జనాలను చైతన్య పరుస్తూ భూమిలేని వారికి భూములను పంచి ఇవ్వడం జరిగిందని, పేద ప్రజలు సేద్యం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ వర్ధంతి సభ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, అధ్యక్షతన జరుగగా మండల సిపిఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, సుదగాని వెంకన్న, పల్లె శ్రీనివాస్, గాజుల స్వామి, జివిలకపల్లి వెంకటేష్, ఎండి అజీం, మస్తాన్, గోట్టి పాముల సునీల్ కుమార్, ఎండి గుంశీ, ఎత్తరి యాదగిరి, బీరకాయల నరసింహ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల పిల్లలు చదువుకునే పరిస్థితి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకు రూ.లక్షల్లో వేతనం పొందుతున్నారని, పేద విద్యార్థుల ఫీజుల చెల్లింపుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ రియంబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యార్థులు చదువుకుంటున్న విషయం పాలకులకు తెలియదా అని ప్రశ్నించారు. రియంబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేదింపులకు గురి చేస్తున్నాయని చెప్పారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోడంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పగిడి జీడయ్యయాదవ్, సురేష్, మహేష్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన చలమల్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు మంగళవారం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.94,317 ఆర్థిక సహాయం అందించి ఆండగా నిలిచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రీనివాస్ మృతి కుటుంబానికి తీరని లోటని అన్నారు. భవిష్యత్తులో శ్రీనివాస్ కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చిన తాము అండగా ఉంటామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మి నర్సు, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు జెల్ల శ్రీనివాస్, నాయకులు గోశిక చక్రపాణి, సాయిని శేఖర్, పున్న భద్రాచలం, పున్న కనకరత్నం, చిలువేరు వెంకటయ్య, ముదుదుడ్ల రాజు, దొంత యాదగిరి, పున్న యాదగిరి, గంజి రామకృష్ణ, పున్న శివకుమార్, సింగం ఉపేందర్‌తోపాటు గ్రామస్తులు ఉన్నారు.



## బహిరంగ మార్కెట్ ధరను చెల్లించాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో ఉదయ సముద్రం ప్రాజెక్టు కింద భూములను కోల్పోయిన రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం భూమి ధర చెల్లించాలని ఆ గ్రామ రైతులు ఆర్‌ఆర్‌ఎల్‌ఏ సెక్షన్ ప్రత్యేక ఉప కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. భూనిర్వాసితుల అభ్యంతరాల కోసం మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభలో నిర్వాసితులు పాల్గొని మాట్లాడుతూ జాతీయ రహదారి వెంట ఎకరాకు రూ. 80 లక్షల ధర ఉండగా ప్రభుత్వం కేవలం రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం రూ. 2,70,000 వేలు మాత్రమే చెల్లిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బహిరంగా మార్కెట్ ప్రకారం నష్టపరిహారమైనా చెల్లించాలి లేదంటే నష్టపోయిన భూమిని మరో ప్రాంతంలో కేటాయించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామ సభ ఏర్పాటు చేసి సంభదిత అధికారులు రాకపోవడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తగిన నష్టపరిహారం చెల్లించకపోతే రైతులమంతా ఏకమై ఆందోళనలు చేపడతామన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పశువులకు అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జీడీఏహెచ్ డాక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని దొండవారిగూడెం, కొత్తగూడెం గ్రామంలో సుమారు 881 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాది నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 9538 పశువులకు ఉచితంగా టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నాయి ని దుర్గరమాదేవి, పశుసంవర్ధక అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ జూలకంటి వెంకట్‌రెడ్డి, శంకర్‌రావు, సీహెచ్.జ్ఞానేశ్వర్‌ప్రసాద్, జేవీవో కృష్ణ, ఎల్ఎస్ఏలు నాగరాజుయాదవ్, నాగేందర్, రమ్య, శ్రీకాం త్, వీఏ అజ్జర్, ఓఎస్‌లు, గోపాలమిత్రలు, మైత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పదిలక్షల పోస్టల్ బీమా

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** మండల కేంద్రంలోని శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ యూనియన్‌లోని 20 మందికి పోస్టల్ బీమా ద్వారా ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు మోత్కూర్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా ఎంతో అవసరమని అనుకోని ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన డబ్బులు వారి కుటుంబానికి ఆసరా అవుతాయని ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన మండలి అధ్యక్షులు మజ్జిగ నరేశ్, ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, రంగ శ్రీను, రాచమల్ల సత్తయ్య, మాద రవి, యువజన మండలి సభ్యులు దిగోజు శ్రీనివాస చారి, తవిటి వెంకన్న, రాగటి సత్యనారాయణ, కొంగరి పరుషరాములు, మొగిలిపాక శ్యామ్, మురారిశెట్టి సందీప్‌పాల్గొన్నారు.





## పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి

**ప్రజాపక్షం/డిండి;** విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభను కనబరిచి సత్తా చాటాలని డిండి మండల తహశీల్దార్ హన్మంత్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం డిండి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 22 మంది విద్యార్థిని, విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను అందజేశారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంచి కార్యక్రమాలను ప్రశంసిస్తూ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మెరిట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రాధికకృష్ణ, విశ్రాంత ఎంపిడివో సుదర్శన్, యూత్ ఫర్ సేవా సభ్యులు శ్రీశైలం, రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిశు విక్రయాలు, అక్రమ దత్తతపై అవగాహన



**ప్రజాపక్షం/డిండి;** శిశు విక్రయాలు, అక్రమ దత్తత చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు ఎవరు పాల్పడిన చట్టపరమైన చర్యలుంటాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమణ అన్నారు. మంగళవారం మండలంలోని కందుకూరు జెడ్పిహైస్కూల్‌లో విద్యార్థులకు శిశు విక్రయాలు, అక్రమ దత్తత,,రవాణా, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ గ్రామాల్లో ప్రజలకు, తల్లిదండ్రులకు అక్రమ దత్తత, శిశు విక్రయాలపై చైతన్యపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/నందికొండ:** రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్ల సమస్యల పరిష్కార సాధనకై ఈనెల ఏడవ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా చౌక్ లో సమస్యల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పదవీ విరమణానంతర ప్రయోజనాలు అందక విశ్రాంత ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిఏలు బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చినా అవి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని వెంటనే పిఆర్‌సి వేసి 44శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పి. నారాయణ రెడ్డి, నరసింహారెడ్డి,కేశవరెడ్డి,ఇంద్రారెడ్డి,ఎం. సీత కళ్యాణి, ఈశ్వరయ్య,సాంబశివరావు,కే.బాలాజీ, సిహెచ్. రవి,నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాలతో అల్లాడిపోతున్న అన్నదాత



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అకాల వర్షాలతో ధాన్యపు కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతలు బిక్కు బిక్కు మంటూ వరుణుడు ఏ క్షణాన ఎప్పుడు ఎలా విరుచుకుపడుతున్నాడో అర్థం కాక అల్లాడిపోతున్న కడు దయనీయ పరిస్థితి నెలకొంది. కుటుంబాలకు కుటుంబాలే వ్యవసాయం మీద ఆధారపడి కాయకష్టం చేసి పండించే పంట కళ్ళముందే వర్షంలో తడిసి ముద్ద అయిపోయి మొలకలు ఎత్తిపోతుంటే ఒంటిలో నరాలు తెగిపోయినంత బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోయకపోతే భారీ వర్షాలతో పంట నేలకొరిగిపోయి గొలుసుకున్న ధాన్యం వర్షార్పణం అవుతుందని కన్నీటి పర్యంతమవుతున్నారు రైతులు. పంట కోసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మకానికి రాశులు పోసి ఆరబెట్టుకుని తేమశాతం తగ్గించుకొని అమ్ముకొని బయటపడదామనుకుంటే కళ్ళు విస్తుపోయేలా వర్షం కుమ్మేసి పంటను నీటిపాలు చేస్తుందని బోరున విలపిస్తున్నారు. మండల వ్యాప్తంగా రైతుల బాధ వర్ణాతీతం. తుఫానులు అల్పపీడిన ప్రభావాలు తగ్గిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ధా న్యం కొనుగోళ్లలో నిమగ్నమయి ధాన్యం సేకరణ చర్యలు ముమ్మరం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

# గన్నీ సంచుల కొరత ఉండొద్దు : ఆర్‌డిఒ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి, పెండ్లిపాకుల గ్రామాలలో మంగళవారం పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో రమణారెడ్డి పిఏసిఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన వరిధాన్యంను రిజిస్ట్రర్‌లో ఒక క్రమ పద్ధతిలో నమోదు చేసుకొని క్రమ సంఖ్య ప్రకారం ధాన్యం కొనుగోళ్ళు చేయాలని పిఏసిఎస్ సిఈవో పల్లా తిరుపతిరెడ్డి, కొనుగోళు కేంద్రాల ఇంచార్జీలకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏగ్రేడ్ రూ. 2389, బిగ్రేడ్ ధర రూ. 2369లను రైతులు పొందాలని సూచించారు. వర్షా భావం దృష్ట్యా లారీలు, టార్ఫాలిన్‌లు, గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని పిఏసిఎస్ సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్, డిటిసిఎస్ సయ్యద్ మొబిన్, ఏవో జానకిరాములు, సిఈవో పల్లా తిరుపతిరెడ్డి, ఏఈవో మల్లేష్, పిఏసిఎస్ డైరెక్టర్లు తేలుకుంట్ల యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/గుండాల;** ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా గుండాల మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో వందల ఎకరాలలో చేతికొచ్చిన పంట నీట మునిగిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రతి సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఉండడం ఈఏడాది సకాలంలో వానలు పడి పంటలు మంచిగా పండుతాయనే సమయానికి మొంథా తుఫాను ప్రభావంతో చేతికొచ్చిన వరి పంట, పత్తి పంట పూర్తి స్థాయిలో నీటిలో మునిగి, వరదకు కొట్టుకుపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ములిగె నక్క మీద తాడిపండు పడ్డ చందంగా రైతుల పరిస్థితి నెలకొంది. ఒక వైపు నకిలి విత్తనాల బెడద, కరువు కష్టాలు, ఇంకో వైపు అనుకోకుండా వచ్చే తుఫాన్లు, వరదల వల్ల రైతులకు తీవ్ర నష్టాలే మిగితున్న పరిస్థితి నెలకొంది. ఎటు చూసిన రైతుల నష్టపోతున్నాడే తప్ప రైతుకు మేలు జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటూ తుఫాను వలన నష్టపోయిన రైతుల పంట పొలాలలోకి వచ్చి పొలాలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# పరిమితికి మించి ప్రయాణించే వాహనాలపై కొరడా



**ప్రజాపక్షం/హాలియా:** పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో ఎక్కిస్తే వాటిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు మంగళవారం హాలియా వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కొందరు ఆటోల వారు పరిమితికి మించి ఆటో పైన ఎక్కించుకొని వెళ్తున్నట్లు ప్రత్యక్షంగా చూసి గుర్తించామని ఎస్సై సాయి ప్రశాంత్ చెప్పారు. వీరిపై కేసులు నమోదు చేసి ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. అతివేగం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని జరుగుతున్న రవాణా వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్సై చెప్పారు. అందుకే అటువంటి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించినట్లు తెలిపారు. ఈ కారణంగా ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలపై కొరడా ఝుళిపించనున్నట్లు చెప్పారు. ప్రతి ప్రమాదానికి అతివేగమే ప్రధాన కారణమని అందువలన వేగం నియంత్రించుకొని గమ్యానికి క్షేమంగా చేరాలని ఆయన ప్రయాణికులకు సూచించారు.



## శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/వలిగొండ :** శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంవెంకటాపురం గ్రామం, వలిగొండ మండలం, యాదాద్రిభువనగిరి జిల్లా దేవస్థానం యందు తేది:31.10.2025 నుండి తేది:05.11.2025 వరకు నిర్వహిస్తున్న శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తేది: 04.11.2025 మంగళవారం ఉ.8.00 గం.ల నుండి ద్వార తోరణ, ధ్వజకుంభ ఆరాధన, మూర్తి కుంభఆరాధన, చతుస్థానార్చన, నిత్యహోమాలు, తదుపరి ఉ.11.00గం.లకు శ్రీ సుదర్శన నారసింహ ఇష్టి పూర్ణాహుతి, బలిహరణం,నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించడమైనదని దేవస్థానం కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో దేవస్థానం వలిగొండ ఎంపిడిఓ జి.జలంధర్ రెడ్డి, దేవస్థానం ఘాట్ రోడ్డు దాత, అర్చకులు మరియు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## బస్సులు నడపాలని వినతి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి హైదరాబాద్‌ల మధ్య విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు ఇతర ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని సమయాలలో అదనపు బస్సులు నడపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు బిజిలి కుమారస్వామి బృందం మంగళవారం దిల్సుఖ్నగర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఉదయం, సాయంత్రం వేళ బస్సుల లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని, రాత్రి బస్సు గం 10ల నుండి రాత్రి గం 10.30 మధ్యలో అదనంగా నడపాలని కోరిన వెంటనే డిపో మేనేజర్ స్పందించి ప్రస్తుతం నడుపుతున్న బస్సులలో సర్దుబాటు చేసి అందరికీ అందుబాటులో ఉండేలా అన్ని సమయాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పోచంపల్లి స్థానిక నాయకులు సీత కృష్ణ, భారత గిరివాసులు ఆయన వెంట ఉన్నారు.

## డాక్టరేట్ కాన్వకేషన్ సర్టిఫికెట్ పొందిన భయ్యా నేహా భవాని

**ప్రజాపక్షం/డిండి;** నల్గొండ జిల్లాలోని గుండ్లపల్లి (డిండి) మండల పరిధిలోని తవకలాపూర్ గ్రామానికి చెందిన భయ్యా నేహా భవానీ మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సీటి నుండి శ్రీమతి సరోజిని రాములమ్మ ఫార్మసీ కాలేజ్ నుండి 20192025 వరకు ఆరు సంవత్సరాల్లో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ విద్యను అభ్యసించి ద్విగ్విజయంగా పూర్తి చేశారు.మంగళవారం కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సెర్మనీ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జానకి ఐపిఎస్, సూపరింటెంట్ ఆఫ్ డిస్ట్రిక్ జైల్ వెంకటేషం, రిటైర్డ్ ఐపిఎస్ శ్రీనివాసులు చేతుల మీదుగా డాక్టరేట్ కాన్వకేషన్ సర్టిఫికేట్ ను భయ్యా నేహా భవాని అందుకున్నారు. సరోజినీ రాములమ్మ ఫార్మసి కాలేజీ సెమినార్ హాల్‌లో డాక్టర్ పి. బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. మంగిలార్, కళాశాల అధ్యాపకులు, సహచర ఫార్మసి విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బకాయిలను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పెండింగ్‌లో ఉన్న 9వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా, దాదాపు 9000 కోట్లకు పైగా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు.పాత ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం అయినా వస్తే మా విద్యార్థుల బ్రతుకులు మారుతాయని ఎన్నో ఆశలు కన్నా విద్యార్థుల ఆశలు ఆవిరయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకొని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విద్యార్థులు అందరిని కలుపుకొని రాష్ట్ర మంత్రులను,ఎమ్మెల్యేలను అక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కట్టబోయిన రాజు, నాంపల్లి శివ,భను ప్రసాదు,రావుల శివ ,నాగరాజు పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా పుష్ప జలాభిషేకం

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్య పుష్ప జల మహా అభిషేకం నిర్వ హించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు అభిషేకం చేసి చల్లగా చూడాలని వేడుకున్నారు.




## తుఫాను బాధిత రైతుల పంట పొలాలు పరిశీలన



**ప్రజాపక్షం/మాడుగులపల్లి** : మొంథా తుఫాన్ ప్రభావం తో మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో వరి పంటలు నేలకొరిగిన పంట పొలాలను మంగళవారం తోపుచర్ల,ఇసుక భావి గూడెం గ్రామాలలో రైతుల తో కలసి నెల వాలిన వరి పంటను పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల రూపాయల నష్ట పరిహారం అందచేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య.అయన వెంట రైతులు పార్టీ నాయకులు తదితరులున్నారు.

## మహిళ అదృశ్యం



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన మంకాల రేణుక(35) గత నెల 31వ తేది నుండి కనిపించకుండా పోయిందని స్థానిక ఎస్ఐ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రేణుక భర్త ఫిర్యాదు ప్రకారం 31వ తేది సాయంత్రం నుండి ఆమె కనిపించడం లేదని, బంధు, మిత్రుల వద్ద వెతికినా ఆచూకి తెలియలేదని ఆయన తెలిపారు. ఆధారాలు దొరికితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

# ఫీజు బకాయిల విడుదలకు కృషి చేయండి



**- విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి**
**- ఎంఎల్ఏ డా.తెల్లంకు ఏఐఎస్ఎఫ్ వినతి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యేందుకు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్ఏ డా. తెల్లం వెంకటరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు భద్రాచలం చేరుకున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధి బృందం మంగళవారం ఎంఎల్ఏను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్, ఉపకార వేతనాలు విడుదల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, తద్వారా చదువులు సాగే పరిస్థితి లేకుండా పోయిందని మండిపడ్డారు. బకాయిల కోసం కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుంటే విజిలెన్స్ దాడులు నిర్వహిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో పాలకులు ఆటలాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదనీ, ఇలాంటి చర్యలను ఏఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చిన వినతి పత్రంపై ఎంఎల్ఏ స్పందించారని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, నాయకులు రమణ, పవన్, ఉదయ్, మానస్ తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ఉన్నత క్విజ్ పోటీల్లో కొమ్మాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. క్విజ్ పోటీల్లో ఎర్ర మనీష్, బాతు మల్లేష్, బుర్ర మనోహర్‌లు ప్రతిభ చాటగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్, సఫియాబేగం, కోట విజయ వెంకన్న, మందడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసచారి, బండ బాలరాజు, గడ్డం శ్రీనివాస్, సమ్రీన్‌లు అభినందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.

## మహాసభను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** ఐద్వా ఆలిండియా 14 మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు తంగెళ్ల వెంకటచంద్ర, మద్దెల జ్యోతిలు కోరారు. మంగళవారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహాసభలు 2026 జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాద్‌లో జరుగు మహాసభల సందర్భంగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాళ్ళు సుందరి రమాదేవి, యానాల సుశీల, నాయకురాళ్ళు భూతం సరిత, ఆవుల సరోజన, సైదమ్మ, నాగజ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదులపై జాయింట్ విచారణ



**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ఆరా**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని శంకరగిరి తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పై స్థానికులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల పరిషత్, రెవిన్యూ అధికారులు మంగళవారం జాయింట్ విచారణ చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల ను పొందిన లబ్ధిదారులు ఇళ్లలో ఉండటం లేదని, కొంత మంది విక్రయిస్తున్నారని స్థానికులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కాగా తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ లు జాయింట్‌గా విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న వారి గురించి ఆరా తీశారు. రెండు ఇళ్లు ఖాళీగా ఉండటంతో వారిని పిలిపించి ఇంట్లో ఉండాల్సిందేనని లేకుంటే రద్దు చేస్తామని ఆదేశించారు. అర్హత లేని వారికి ఇళ్లు మంజూరు తచేశారని పేర్కొన్నారు. వారికి స్థలం ఉన్నందున్న రెండింటిలో ఒకటి రద్దు చేసుకోవాలని సూచించారు. ఇళ్ల ను విక్రయించే వారి గురించి వివరాలు సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం నివేదిక ను జిల్లా కలెక్టర్ కు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణ లో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్లు ఆలస్యం మధుసూధన్ రావు, అల్లం రవికుమార్, జీపీవో జానకిరాములు, పంచాయతీ కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకు ప్రచారం



**ప్రజా పక్షం/ హాలియా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారతీయ రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి సున్నిత గెలుపుకు నల్లగొండ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎంసీ కోటిరెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిలు ముమ్మరంగా ప్రచార నిర్వహిస్తున్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో భాగమైన బోరుబండ ప్రాంతంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాగంటి సునీతను గెలిపించాలని వీరు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థిని గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఉపయోగపడుతుందని వారు కోరారు.

# రైతులు దళారులను ఆశ్రయించొద్దు

**కూసుమంచి ఎడిఎ సతీష్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు దళారులను ఆశ్రయించవద్దని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్ సూచించారు. మండలం లోని ఆచార్లగూడెం, అనాసాగారాం గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ను అందించేందుకు కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర ను పొందాలని సూచించారు. రైతాంగం కోసం మండలం లోని 20 కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటిచైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల



వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో అరవింద్, డీసీఎంఎస్ సిబ్బంది నవీన్, గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో గాలికుంటు వ్యాధులను అరికట్టాలి



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** గ్రామాలలో గాలికుంటు వ్యాధులను అరికట్టాలని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ డి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మంగాపురం, కట్టవారిగూడెం గ్రామాల్లో గాలికుంటు టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. పశువులకు ట్యాగ్ (చెవు పోగు) వేయడం, అదేవిధంగా టీకా వేయడం, వేసిన టీకా లెక్కలను యాప్ నందు ఆన్‌లైన్ చేశారు. 36 ఆవులు, 358 గేదెలకు టీకాలు వేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ బి రవి, సిబ్బంది ఉపేందర్ రావు, జవహర్, గోపాల మిత్రలు వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, గోపి పాల్గొన్నారు.

# హత్యపై కాంగ్రెస్ మార్క్ విచారణ

**-రాజకీయ హత్యలకు భట్టివిక్రమార్కే బాధ్యత వహించాలి : పోతినేని**
**-రామారావు హత్యపై సిపిఎం నిరసన ర్యాలీ**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యపై ఖమ్మం పోలీసులు కాంగ్రెస్ మార్క్ విచారణ జరుపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. రాజకీయ కోణంలో పోలీసులు విచారణ జరపకుండా కళాశాలలు, ఇతరత్రా వైపు విచారణ కొనసాగిస్తూ పూర్తిగా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సామినేని రామారావు హత్యకు నిరసనగా దోషలను వెంటనే కనుగొని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మంలో సిపిఎం ఖమ్మం రూరల్ మండలం ఖమ్మం డివిజన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెవిలియన్ మైదానం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగిన ఈ ర్యాలీని ఉద్దేశించి పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఈ హత్య గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని ఇందుకు ఖమ్మం పోలీస్ కమిషనర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మార్క్ విచారణ జరుపుతున్నారని ఇందులో భాగంగా ప్రశ్నించే వారిని ముద్దాయిలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని సుదర్శన్ ఆరోపించారు. ఖమ్మం పోలీసులు సరి కొత్త విచారణకు నాంది పలుకుతున్నారని ఆయన తెలిపారు. భట్టి విక్రమార్క ఇందుకు బాధ్యత వహించాలని సుదర్శన్ స్పష్టం చేశారు. మా సారు ఉన్నారు మా మేడం ఉంది మాకేం కాదనే రీతిలో కాంగ్రెస్ కార్యకర్తలు వ్యవహరిస్తున్నారని అటువంటి హంతకులను కాపాడే ప్రయత్నం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని సుదర్శన్ ఆరోపించారు. జిల్లాలో ఎక్కడ జరగకుండా మధిర నియోజక వర్గంలోనే రాజకీయ హత్యలు ఎందుకు జరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఐదు రోజులైనా ఇంత వరకు క్లూస్ టీంలు, కానీ డాగ్ స్కాడ్‌లు కానీ ఎటువంటి ఆధారాన్ని కనుగోనలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. పోలీసులు విచారణ జరిపి దోషులను తేల్చకపోతే ప్రజలే దోషులను తేల్చి శిక్షిస్తారని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా చట్టబద్ధంగా పోలీస్ విచారణ సాగించాలని ఆయన కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వై. విక్రం, బండి రమేష్, మాచర్ల భారతి, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# 15న ప్రత్యేక లోక్ అదాలత్

**-న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్**



**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులు, బ్యాంకర్లు, చిట్ ఫండ్ ప్రతినిధులు తదితరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో మొదటి అదనపు న్యాయమూర్తి ఉమాదేవి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు, చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్టు పురుగుల పెంపకంతో అధిక దిగుబడి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం గ్రామంలో గల పట్టు రైతు శేషగిరిరావు పట్టు పురుగుల పెంపకంలో 20 రోజుల్లో రూ.72వేలు రాబడి పొందారు. దీనిని ఏ.ముత్యాల(డిడి సెరికల్చర్) ఖమ్మం వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణు, ఏఎస్‌వోలు సిహెచ్.కామేశ్వరరావు, బి.దేవరాజు పట్టు పంటను పరిశీలించారు. రెబ్బవరం గ్రామంలో ఇప్పటివరకు 12 మంది రైతులు 25వేల ఎకరాల మల్బరీ పంటను సాగు చేస్తున్నారు. పట్టు పరిశ్రమ అన్ని పంటల కంటే అత్యధిక ఆదాయం తక్కువ ఖర్చు తక్కువ సమయంలో వస్తుందని తెలియజేశారు. కొత్తగా పట్టు పరిశ్రమ చేద్దామనుకున్న రైతులకు ప్రభుత్వం ద్వారా షెడ్లను నిర్మించడానికి జనరల్ రైతులకు రూ.2.25లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.292500లు, మల్బరీ తట పెంచడానికి జనరల్ రైతులకు రూ.6వేలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.8వేలు ప్రభుత్వం ద్వారా అందించబడుతుంది. ఈ పట్టు పరిశ్రమ చేయుటకు ఆకస్తి ఉన్న రైతులు ఏ.ముత్యాలు 8977714573, ఆకుల వేణు 8977714105, బి.దేవరాజ్ 9966435542 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# నగదు రహిత లావాదేవీలతో అనేక ప్రయోజనాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** నగదు రహిత లావాదేవీలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సిఆర్ పి అనిత అన్నారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండిలో మంగళవారం నగదు రహిత లావాదేవీలపై అవగాహన కార్యక్రమం మదర్ తెరిసా గ్రామ సమైక్య మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. వాడుకలో సౌలభ్యం ఎప్పుడైనా ఎక్కడైనా ఏదైనా మోడ్ సురక్షిత లావాదేవీలు ఆర్థిక చేరిక సులభతరం డిజిటల్ చెల్లింపులపై ప్రోత్సాహం క్యాష్ బ్యాక్ ఆఫర్‌లు నగదు పోతుందని లేదా నకిలీ కరెన్సీని పొందవచ్చు అని భయం లేదని నగదు నిర్వహించాల్సిన అవసరం లేదని ఇంటి నుంచి సౌకర్యం చేతి వేళ్ళ మీద బ్యాంకింగ్ త్వరిత, సురక్షిత చెల్లింపుల ద్వారా సమయాన్ని ఆదా చేస్తుందని ఏ సమయంలోనైనా ఇంటిలో నుంచి లావాదేవీలు సెల్ ఫోన్ ద్వారా నిర్వహించుకోవచ్చు అని అన్నారు. ఇబ్బందులు లేకుండా ఎక్కడికైనా ఏ ప్రాంతానికైనా ఏ సమయములోనైనా లావాదేవీలు జరుపుకోవాలని దీనిద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నగదు రహిత లావాదేవీలపై అన్ని గ్రామ సమైక్యలలో, సమైక్య లీడర్లకు, గ్రూపు లీడర్లకు సభ్యులకు అవగాహన కార్యక్రమాలు ఈ నెల చివరికల్లా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్య సభ్యులు స్వయం సహాయక సంఘాల సభ్యులు లీడర్లు పాల్గొన్నారు.

# వైరా బస్టాండ్‌లో రూ.50వేలు నగదు అపహరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా బస్టాండ్‌లో వరుస దొంగతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. బస్టాండ్ సిసి కెమెరాలు పర్యవేక్షణ లేకపోవడం కూడా వరుస దొంగతనాలకు కారణం అవుతున్నాయి. మంగళవారం వైరా బస్టాండ్‌లో తాటిపూడి గ్రామానికి చెందిన మహిళ పరుసులో నుంచి రూ.50వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదేవిధంగా గత వారం రోజులు క్రితం ఐదు సెల్‌ఫోన్‌లు కూడా వైరా బస్టాండ్‌లో దొంగతనానికి గురయ్యాయి. ఇలా వరుస దొంగతనాలు పదేపదే బస్టాండ్‌లో జరగడంతో పలువురిని కలవరపెడుతున్నాయి. బస్టాండ్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచితే దొంగతనాలకు ఆకతాయిలకు అడ్డుకట్ట వేయవచ్చు అని పలువురు తెలుపుతున్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కార్తీక పౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమైయ్యాయి. ఈ పోటీలను మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు అడపాల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడలు జాతీయ స్థాయి వరకు రాణించాలని సూచించారు. యువత మధ్య స్నేహాభావం పెంపొందిస్తుందని అన్నారు. కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను కాపాడాల్సిన భాధ్యత నేటి యువత పై ఉందని అన్నారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, యం.సుధీర్, పగిళ్ల ఆశోక్, వెంకన్న, రెడ్డబోయిన నవీన్, ఎన్.బాబు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు సత్యంకి మాతృవియోగం

**- నివాళులర్పించిన జర్నలిస్టులు**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం సీనియర్ జర్నలిస్ట్ చిరసవాడ సత్యం మాతృమూర్తి నాగమ్మ అనారోగ్యంతో వారి స్వగృహంలో కన్నుముశారు. మంగళవారం ప్రధాన పత్రికల సీనియర్ జర్నలిస్టులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుమారులు సత్యం, వెంకటేశ్వర్లును పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యం కల్పించారు. అభ్యుదయ భావాలు కలిగిన నాగమ్మ కుమారులను,కుమార్తెను ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దారని వారు కొనియాడారు. ఆమె మృతి కుటుంబానికి తీరని లోటని తెలిపారు. గ్రామస్తులు, బంధువుల అశ్రునయనాల నడుమ నాగమ్మ అంతిమయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఉబ్బని సుందర్, పప్పుల సుధాకర్, గోవింద్, వెంకట్, మేకల నాగరాజు, కూరపాటి విజయ్, గుజ్జ రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోతల సమయంలో వరి మళ్లలో నీరు

**తుఫాను తెచ్చిన తంట**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** నైరుతి రుతుపవనాలు సరైన సమయంలో రావడం వలన ఈ ఏడాది వరి పండించే రైతులకు ఆరంభంలో వ్యవసాయ సీజన్ శుభ పరిణామంగా మొదలైంది. ఆ తర్వాత వరి పంటకు కావలసినంత వర్షపాతం పడటం రైతులకు తిరుగు లేదనిపించింది. క్రమం తప్పకుండా కురిసిన వర్షాలు వలన చెరువు తూములు తీయకుండానే వరి పంట కోతలు కొచ్చాయి. అక్టోబర్ నెల చివరిలో వచ్చిన తుఫాన్ పత్తి రైతులతో పాటు వరి పండించే రైతులకు కూడా ఆశనిపాతంగా మారింది. తీవ్ర నష్టం కలిగించింది. భారీ నష్టం కలిగించకపోయినా వరి పొలాల్లో నిలిచిన నీరు పూతలకు ఆటంకంగా మారడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. కోతలకు వచ్చిన వరి పనలు పడిపోవడం వలన కోతలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం పెనుబల్లి మండలంలో రైతులు సాగు చేసిన వరి పంట దాదాపు కోతలకు సిద్ధమయింది. అదే సమయంలో వరి మళ్లల్లో నిలిచిన నీళ్ల వల్ల కోతలకు ఆటంకమేర్పడుతుంది. నీటిని పూర్తిగా బయటకు పంపిస్తేనే వరి కోయడానికి అనువుగా ఉంటుంది. నీరు ఏ మాత్రం ఉన్నా మెషిన్లు దిగబడి పోతాయి. నాగార్జున సాగర్ కాలువ, చెరువులు, బోర్ల కింద పండించిన వరి పంట అంతా కోతల కొచ్చింది. పక్వానికి వచ్చిన వరి కంకులు ఎండే సమయంలో వచ్చిన తుఫాను కింద ఆరకుండా చేసింది. తేమ అధికంగా ఉంటే కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైతులను ఇబ్బందులు పెట్టే అవకాశం ఉంది. గిట్టుబాటు ధర కూడా తగ్గుతుంది. మండలంలో వరి కోతలు అక్కడక్కడా ఇప్పుడే ప్రారంభమయ్యాయి. మరో వారం పది రోజులు పాటు వర్షాలు పడకుండా ఉంటే పొలాలలో నిల్వ ఉన్న నీరు తగ్గే అవకాశం ఉంది. వరి పంటకు నీరు ఎంత అవసరమో పంట దిగుబడి సమయంలో మడుల్లో పూర్తిగా నీరు లేకుండా ఉంటేనే కోతలకు అనుకూలంగా ఉంటుంది. మంచి రాబడిని ఆశించి అధిక పెట్టుబడులతో రైతులు పంటను సాగు చేస్తారు. పంట కోత కోసి దిగుబడి ఇంటికొచ్చేవరకు రైతులు ప్రకృతి దయా దక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంజెపి కూసుమంచి విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఈనెల 4వ తారీఖున కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన అండర్ 17 అంతర్ జిల్లా కబడ్డీ క్రీడా పోటీలలో మహాత్మ జ్యోతిబాపూలె కూసుమంచి గురుకుల విద్యార్థి ఎస్ విగ్నేష్ 10వ తరగతి అద్భుత ప్రతిభ కనబరిచి ఈనెల 8న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడూళ్ళబయ్యారం నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ క్రీడాకారున్ని ఉమ్మడి జిల్లా బిసి గురుకులాల ఆర్సిఓ సిహెచ్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ పి మల్లయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు బి నరసింహ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.